kalamdaily.com

# కలం

ప్రజల గళం...

Follow on: Kalamtelugu

సోమవారం ● 20-04-2026

పేజీలు: 3



SINGLE TOPIC

కామెంట్స్ - కాంట్రవర్సీ



2012 సెప్టెంబర్ 30న హైదరాబాద్‌లో సాగరహారం



# పుష్కరకాలమైనా అవే కూతలు

## తెలంగాణ ఏర్పాటుపై నేతల నెగెటివ్ కామెంట్లు.. టైం చూసి బుద్ధి చెప్తున్న ప్రజలు

సమైక్య జెండా పట్టిన జగన్ పార్టీకి ఇప్పటికీ ఉనికి కరువు

'రెండు కండ్ల సిద్ధాంత'మన్న చంద్రబాబు ఏపీకే పరిమితం

నోరు జారిన ప్రతిసారీ పవన్ కల్యాణ్‌కు ఇక్కడ వ్యతిరేకతే

పార్టీ నుంచి 'తెలంగాణ' తీసేసిన కేసీఆర్‌కు తప్పని తిప్పలు

తల్లిని చంపి బిడ్డను బతికించారన్న మోదీకీ నిరసన సెగ

తేజస్వీ సూర్య వ్యాఖ్యలతో ఇరకాటంలో పడ్డ రాష్ట్ర బీజేపీ

ఆరు దశాబ్దాల ఆకాంక్ష.. వెయ్యి మందికిపైగా ప్రాణత్యాగం... గల్లీ నుంచి ఢిల్లీ వరకు అలుపెరుగని పోరాటం.. ఎట్టకేలకు సాకారమైన తెలంగాణ రాష్ట్రం! తెలంగాణ ఉద్యమాన్ని కించపరిచిన, వ్యతిరేకించిన పార్టీలకు ఈ గడ్డపై నూకలు చెల్లాయి. వాటి ఉనికే ప్రశ్నార్థకమైంది. ఎన్నికల్లో భూస్థాపితమయ్యాయి. ఎప్పటికీ ఇక్కడ మొలకెత్తవనే భావన ఏర్పడింది. స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాతా కొన్ని పార్టీలు రాష్ట్ర ఏర్పాటుపై విషం చిమ్ముతూనే ఉన్నాయి. విద్వేషపూరిత మాటలు, పోరాటాన్ని అవమానించే కామెంట్లు చేస్తూనే ఉన్నాయి.

నరేంద్ర మోదీ ప్రధాని అయినప్పటి నుంచి తెలంగాణ ఏర్పాటు విధానాన్ని తప్పపడుతూనే ఉన్నారు. 'తల్లిని చంపి బిడ్డను బయటకు తీశారు' అంటూ పార్లమెంట్ సాక్షిగా కామెంట్లు చేశారు. తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడటాన్ని స్వాగతిస్తున్నామని చెప్తూనే నెగెటివ్ కామెంట్లు చేశారు. అమిత్ షా సైతం ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. తాజాగా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య తెలంగాణ ఏర్పాటును పాకిస్తాన్ ఏర్పాటుతో పోల్చారు. ఆయన లోక్‌సభ వేదికగా చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ఉద్యమశక్తుల్ని మరోమారు ఏకం చేస్తున్నాయి. బీజేపీ నేతలు ఉద్దేశపూర్వకంగానే విషం చిమ్ముతున్నారన్న అభిప్రాయం నెలకొన్నది.

ఉద్యమాన్ని వ్యతిరేకించారన్న కారణంతో నాడు వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌ను మానుకోటకు రాకుండా తెలంగాణ ఉద్యమకారులు అడ్డుకున్నారు. ఆ తర్వాత ఆయన పార్టీకి తెలంగాణలో భవిష్యత్తే లేకుండా పోయింది. 'రెండు కండ్ల సిద్ధాంతం' పేరిట తెలంగాణ మీద కక్ష కట్టారనే భావనతో చంద్రబాబును, ఆయన పార్టీ టీడీపీని ఇక్కడి ప్రజలు తిరస్కరించారు. తెలంగాణలో పోటీ చేసినా డిపాజిట్ సైతం రావట్లేదు. 'ప్రజారాజ్యం' అంటూ రాజకీయ తెరంగేట్రం చేసిన చిరంజీవి సమైక్యాంధ్ర జెండా పట్టుకోగానే తెలంగాణ ప్రజలు "ఇక్కడ మీ అవసరం లేదు" అంటూ ఆ పార్టీని సాగనంపారు.

ఒకప్పుడు ఓయూ ఆర్ట్స్ కాలేజీ ముందు 'జై తెలంగాణ' అంటూ నినదించిన పవన్ కల్యాణ్.. ఆ తర్వాత తెలంగాణ ఏర్పాటు విధానంపై ఇష్టమున్నట్లు మాట్లాడారు. ఆ మధ్య 'కోనసీమ కొబ్బరి చెట్లకు తెలంగాణ దిష్టి తగిలిందేమో' అంటూ కామెంట్లు చేశారు. తెలంగాణను అవమానించిన పవన్ పార్టీ జనసేనకు రాజకీయంగా ఇక్కడ అవకాశమే లేకుండా పోయింది. బీజేపీ జాతీయ నేతలు సైతం తెలంగాణ వ్యతిరేక కామెంట్లు చేస్తున్నారు. తేజస్వీ సూర్య వ్యాఖ్యలను తెలంగాణ బీజేపీ లీడర్లు ఖండించకపోగా సమర్థించేలా మాట్లాడుతున్నారని తెలంగాణ ఉద్యమకారులు మండిపడుతున్నారు.

తెలంగాణ ఏర్పడి పుష్కరకాలం దాటుతున్నా విద్వేషపు మాటలు ఆగడం లేదు. తెలంగాణను వ్యతిరేకించిన వైఎస్ జగన్ ఏపీకి సీఎం కాగానే ప్రగతి భవన్‌కు పిలిపించుకొని రాచమర్యాదలు చేశారన్న కోపంతో కేసీఆర్‌పైనా తెలంగాణ ప్రజలు ఓట్ల రూపంలో ఆగ్రహాన్ని ప్రదర్శించారు. దీంతో బీఆర్ఎస్ ప్రతిపక్షానికే పరిమితమైంది. తెలంగాణ ఏర్పాటు విధానంపై ఇంకా నోటికొచ్చినట్లు మాట్లాడుతున్న నేతలకు తెలంగాణ ప్రజలు ఎలాంటి గుణపాఠం చెప్తారన్నదే ఆసక్తికరం. వీటన్నింటిపై కలం ప్రత్యేక కథనం...

- తెలంగాణ బ్యూరో, కలం




## అమరత్వాన్ని అవమానిస్తున్నారా?

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం వందలు, వేల మంది యువత ప్రాణాలర్పించారు. భగభగమండే నిప్పులను ముద్దాడారు. ఉరికొయ్యలకు వేలాడారు. పైన కనపడుతున్న ఇద్దరిలో ఒకరు శ్రీకాంతాచారి. మరొకరు సిరిపురం యాదయ్య. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆలస్యం కావడం, ఉద్యమ శక్తులను అణచివేయడాన్ని తాళలేక 2009 నవంబర్ 29న హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ చౌరస్తాలో తన ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటిచుకొని ప్రాణాలు వదిలాడు శ్రీకాంతాచారి. ఆ సమయంలో ఆయన వయసు పట్టుమని 21 ఏండ్లు కూడా లేదు. తెలంగాణ ఏర్పాటు ప్రకటన వచ్చినట్టే వచ్చి సమైక్యాంధ్ర కుట్రలతో వెనక్కి వెళ్లడాన్ని తట్టుకోలేక 2010 ఫిబ్రవరి 20న ఓయూ ఎన్సీసీ గేట్ ముందు ఒంటికి నిప్పంటించుకొని పరుగులు తీసి, మాంసం ముద్దయ్యాడు సిరిపురం యాదయ్య. ఆయనకు కూడా పట్టుమని 20 ఏండ్లు లేవు అప్పుడు! ఇలా ఒక్కరా ఇద్దరా ఎందరో అమరులయ్యారు. వారి త్యాగ ఫలమే తెలంగాణ స్వరాష్ట్రం. రాష్ట్రం ఏర్పడి 12 ఏండ్లు అవుతున్నా ఇంకా 'రాష్ట్ర ఏర్పాటు విధానం' సరిగ్గా జరగలేదంటూ ఇష్టమున్నట్లు మాట్లాడుతున్న నేతలు.. ఈ అమరుల త్యాగాలకు ఏం సమాధానం చెప్తారు? ఆ త్యాగాలను అవమానించేలా కామెంట్లు ఉంటున్నాయని తెలంగాణ వాదులు భగ్గుమంటున్నారు.



2009లో ఓయూ ఆర్ట్స్ కాలేజీ ముందు ఏర్పాటు చేసిన సభలో గద్దర్‌తో పవన్ కల్యాణ్

## పవన్.. ఆ రోజును మరిచిపోయావా?

2008 ఆగస్టు 26న 'ప్రజారాజ్యం' పార్టీ అంటూ రాజకీయ అరంగేట్రం చేశారు సినీ నటుడు చిరంజీవి. పార్టీ ఏర్పాటు చేసినప్పుడు తెలంగాణపై స్పష్టమైన వైఖరి ప్రకటించకపోయినా.. 'సామాజిక న్యాయం' అన్నారు. ప్రజారాజ్యం యువ విభాగం యువరాజ్యం అధ్యక్షుడిగా చిరంజీవి తమ్ముడు, సినీ నటుడు పవన్ కల్యాణ్.. 2009లో ఓయూ ఆర్ట్స్ కాలేజీ ముందు తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరం ఏర్పాటు చేసిన సభకు వచ్చి 'జై తెలంగాణ' నినాదాలు చేశారు. తెలంగాణ ఏర్పాటుతోనే సామాజిక న్యాయం సాధ్యమని ప్రకటించారు. గద్దర్ వంటి ప్రజాగాయకులతో కలిసి గళం విప్పారు. అప్పుడు ఆయనను ఇక్కడి వాళ్లు గుండెలకు హత్తుకున్నారు. అలాంటిది ప్రజారాజ్యం పార్టీ సమైక్యాంధ్ర జెండా పట్టడంతో పవన్ సైలెంట్ అయిపోయారు. అదే సమయంలో విడుదలైన ఆయన సినిమా 'కొమురం పులి' టైటిల్‌పై తెలంగాణ విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. సమైక్యాంధ్ర పార్టీలకు తెలంగాణ వీరుల పేర్లు పెట్టుకోవడాన్ని సహించబోమని నిరసనలు తెలపడంతో దిగివచ్చిన పవన్.. టైటిల్ నుంచి 'కొమురం' తీసేసి 'పులి' అని విడుదల చేసుకోవాల్సి వచ్చింది. జనసేన పార్టీని స్థాపించి ఏపీకి పరిమితమైన ఆయన.. ఇప్పటికీ తెలంగాణ ఏర్పాటు విధానం సరిగ్గా లేదంటూ ఇష్టారీతిగా మాట్లాడుతుంటారు. అలా మాట్లాడిన ప్రతిసారీ నాటి ఓయూ ఆర్ట్స్ కాలేజీ ముందు చెప్పిన మాటలను గుర్తుచేస్తూ ఇక్కడి విద్యార్థులు నిరసనలు తెలుపుతుంటారు. జనసేన పార్టీ ఇప్పుడు తెలంగాణలో పోటీ చేసే పరిస్థితి లేకుండా పోయింది.

## కోనసీమకు తెలంగాణ దిష్టి: పవన్

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ కూడా తెలంగాణ ఏర్పాటు విషయంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ కోసం 1960 నుంచి పోరాటం జరుగుతుంటే.. కోనసీమకు తెలంగాణ దిష్టి తగిలిందని, ఏపీ విభజనకు గోదావరి జిల్లాల పచ్చదనమే కారణమంటూ ఆయన వ్యాఖ్యానించారు. 2025 నవంబర్ 26న కోనసీమలో పవన్ పర్యటించారు. అక్కడి కొబ్బరి రైతులతో మాట్లాడుతూ.. "గోదావరి జిల్లాలను ఆంధ్రా అన్నపూర్ణ అంటారు. కొబ్బరి చెట్లతో, పచ్చదనంతో మనం బాగుంటామని తెలంగాణ నేతలు అంటుంటారు. రాష్ట్రం విడిపోవడానికి గోదావరి జిల్లాల పచ్చదనమే కారణం. తెలంగాణ నాయకుల దిష్టి తగిలి కొబ్బరి చెట్లకు మొండాలు కూడా లేవు. ఎంతమంది దిష్టి తగిలితే చెట్లు ఇలా అయిపోతాయి? దీన్ని మనం సరిచేసుకోవాల్సి ఉంది" అని కామెంట్ చేశారు. అంతకుముందు కూడా పలుమార్లు తెలంగాణ ఏర్పాటు విధానంపై విమర్శలు చేశారు.



## రెండు కండ్ల సిద్ధాంతం బెడిసికొట్టినా.. మారని మనిషి

తెలంగాణ ఉద్యమం పీక్స్‌లో ఉన్న 2009లో అప్పటి ఉమ్మడి ఏపీ ప్రతిపక్ష నేత, టీడీపీ చీఫ్ చంద్రబాబు నాయుడు తనది రెండు కండ్ల సిద్ధాంతమని ముందుకు వచ్చారు. తెలంగాణ, ఏపీ తనకు రెండు కండ్ల లాంటివని చెప్పుకొచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఓకేనా కాదా అని చెప్పకుండా ఇలా సిద్ధాంతాలేందని ఆయనను అప్పటి నుంచే తెలంగాణ సమాజం దూరం పెట్టడం మొదలు పెట్టింది. ఆ సిద్ధాంతమే ఆయన పార్టీని తెలంగాణలో ముంచింది. రాష్ట్రంగా ఏర్పడ్డాక తెలంగాణలో టీడీపీ నుంచి పోటీ చేయడానికి నేతలు ఎవరూ ముందుకు రాలేదు. ఎవరైనా పోటీ చేస్తే కనీసం డిపాజిట్ కూడా దక్కడం లేదు. ప్రస్తుతం ఏపీకి సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు.. తెలంగాణ ఏర్పాటు విధానాన్ని తప్పుపడుతూనే ఉన్నారు. హైదరాబాద్ అంశాన్ని ఆయన ప్రస్తావించిన ప్రతిసారి సోషల్ మీడియాలో ట్రోల్ అవుతూనే ఉంది. ''హైదరాబాద్‌ను నేనే అభివృద్ధి చేశాను. ఐటీని తీసుకువచ్చింది నేనే" వంటి ప్రకటనలు ఇప్పటికీ చంద్రబాబు నుంచి వస్తూనే ఉన్నాయి. ఒకప్పుడు తెలంగాణలో వెలుగువెలిగిన టీడీపీ ఇప్పుడు కనీసం అక్కడ పోటీచేసే పరిస్థితి లేదని తెలిసినా ఆ మనిషి మారడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## జగన్‌కు మానుకోట దెబ్బ!

కాంగ్రెస్ నుంచి వైదొలిగి 2011 మార్చి నెలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించిన వైఎస్ జగన్.. మొదట్లో తెలంగాణ ఏర్పాటు అంశంపై మౌనంగా ఉన్నారు. దీనిపై తెలంగాణవాదులు ప్రశ్నించిన ప్రతిసారి దాటవేసేవారు. ఇదే క్రమంలో 2011 మే నెలలో 'ఓదార్పు యాత్ర' పేరిట మానుకోటకు జగన్ టీమ్ బయలుదేరింది. ఆ సమయంలో తెలంగాణ ఉద్యమం కీలక దశలో ఉంది. అలాంటి సిట్యువేషన్‌లో జగన్ మానుకోటలో పర్యటించడాన్ని ఎక్కడికక్కడ తెలంగాణవాదులు అడ్డుకున్నారు. ఇప్పటికీ జగన్ పేరు చెప్పగానే తెలంగాణలో గుర్తుకు వచ్చే సంఘటనగా ఇది నిలిచిపోయింది. 2013లో సమైక్యాంధ్రకే వైఎస్సార్ సీపీ ఓటు అంటూ జగన్ ప్రకటించడంతో.. తెలంగాణలో ఆ పార్టీ క్రమేణా కనుమరుగైపోయింది.




మానుకోట ఘటన నాటి ఫొటోలు

# కేసీఆర్‌కు తప్పని సెగ

తెలంగాణ కోసమే టీఆర్ఎస్ పార్టీని ఏర్పాటు చేసినట్లు చెప్పి.. రాష్ట్రం ఏర్పడ్డాక రెండుసార్లు అధికార పగ్గాలు చేపట్టిన కేసీఆర్‌కూ సెగ తప్పలేదు. సెకండ్ టర్మ్ పాలనలో ఆయన తీసుకున్న నిర్ణయాలు తెలంగాణ ప్రజలను ఆగ్రహానికి గురిచేశాయి. ముఖ్యంగా తెలంగాణ వ్యతిరేకిగా, సమైక్యాంధ్ర వాదిగా ముద్రపడ్డ వైఎస్ జగన్.. ఏపీకి సీఎం కాగానే కేసీఆర్ తెలంగాణ సీఎం హోదాలో ఆయనను నాటి ప్రగతిభవన్‌కు పిలిపించుకొని రాచమర్యాదలు చేశారు. ఆ తర్వాత కేసీఆర్ ఏపీకి వెళ్లి.. రోజా ఇంట్లో భోజనం చేసి, గోదావరి జలాలతో రాయలసీమను రతనాల సీమ చేస్తానని మాటిచ్చారు. అదే క్రమంలో దేశవ్యాప్తంగా తన పార్టీని విస్తరించాల్సి ఉందని చెప్పి.. 'తెలంగాణ' పదాన్ని పార్టీ నుంచి తొలగించుకొని 'బీఆర్ఎస్'గా మార్చేశారు. ఈ పరిణామాలన్నింటినీ చూసిన తెలంగాణ ప్రజలు 2023లో అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్‌ను గద్దె దించి ప్రతిపక్షానికి పరిమితం చేశారు. అదే సమయంలో అటు ఏపీలో జగన్ కూడా అధికారాన్ని కోల్పోయి 11 సీట్లకే పరిమితయ్యారు.

## కామెంట్లను ఖండిస్తున్నా జనం నమ్మట్లే

బీజేపీ కీలక నేతలు తెలంగాణ ఏర్పాటు విధానంపై చేస్తున్న కామెంట్లను బీఆర్ఎస్ నేతలు ఖండిస్తున్నా జనం మాత్రం వారిని నమ్మడం లేదు. తేజస్వీ సూర్య తాజాగా చేసిన వ్యాఖ్యలకు కేటీఆర్, హరీశ్ రావు వంటి బీఆర్ఎస్ సీనియర్లు కౌంటర్ ఇవ్వగా.. సోషల్ మీడియాలో నెటిజన్లు మాత్రం "పార్టీ నుంచి తెలంగాణను తీసేసిన మీకు వాటిని ఖండించే అర్హత కూడా లేదు" అంటూ సెటైర్లు వేస్తున్నారు. తెలంగాణను వ్యతిరేకించిన శక్తులకు అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ పెద్దలు చేసిన రాచమర్యాదలను గుర్తుచేస్తున్నారు.



2019లో నాటి ఏపీ సీఎం వైఎస్ జగన్‌ను ప్రగతి భవన్‌లోకి స్వాగతిస్తున్న కేసీఆర్, కేటీఆర్

## తల్లిని చంపి బిడ్డను బతికించారు: మోదీ



తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సంబంధించి కాంగ్రెస్ అనుసరించిన విధానాన్ని ప్రధాని మోదీ తరచూ తప్పుబడుతూ వస్తున్నారు. బహిరంగ సభలు, పార్లమెంట్‌లో పలుమార్లు ఆయన కామెంట్లు చేశారు. 'తల్లిని చంపి బిడ్డను బతికించారు', 'పార్లమెంట్ తలుపులు మూసి ఏపీని విభజించారు' అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి మూడుసార్లు ఇలాంటి కామెంట్లు చేశారు. మొదట 2014, ఆ తర్వాత 2018, చివరికి 2022లోనూ ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఏర్పడి ఇన్నేండ్లవుతున్నా ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వివాదాస్పదమవుతున్నది. స్వరాష్ట్ర ఉద్యమాన్ని, అమరవీరులను అవమానిస్తూ మోదీ చేసిన వ్యాఖ్యలపై మొదట్లోనే తీవ్ర వ్యతిరేకత వచ్చింది. అయినప్పటికీ ఆయన పదేపదే కామెంట్లు చేస్తూ వచ్చారు. పలువురు బీజేపీ నేతలు కూడా ప్రధాని మోదీ బాటలో నడుస్తూ తెలంగాణ ఏర్పాటుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గతంలో కేంద్రమంత్రి అమిత్ షా పలుమార్లు కామెంట్లు చేయగా, తాజాగా ఎంపీ తేజస్వీ సూర్య చేశారు.

## అవి చేదు జ్ఞాపకాలు: అమిత్ షా



2022 జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో నిర్వహించిన వేడుకల్లో అమిత్ షా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'తెలంగాణ ఏర్పాటు అశాస్త్రీయంగా జరిగింది.. అందుకే రెండు రాష్ట్రాల మధ్య గొడవలు జరుగుతున్నాయి' అని ఆయన వ్యాఖ్యానించారు. అంతకుముందు 'తెలంగాణ, ఏపీ విభజనతో చేదు జ్ఞాపకాలు మిగిలాయి. ఏపీ ఎంతో నష్టపోయింది' అని కామెంట్ చేశారు.

## భారత్, పాక్ విభజన కంటే దారుణం: తేజస్వీ సూర్య



తెలంగాణ ఏర్పాటును కించపరుస్తూ కర్నాటక బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన కామెంట్లు తీవ్ర దుమారం రేపాయి. బ్రిటిష్ వాళ్లు చేసిన భారత్, పాకిస్తాన్ విభజన కంటే దారుణంగా ఏపీ, తెలంగాణను కాంగ్రెస్ విభజించిందని ఆయన కామెంట్ చేశారు. 2026 ఏప్రిల్ 16న లోక్‌సభలో మాట్లాడుతూ ఇలా వ్యాఖ్యానించారు. దశాబ్దాల పోరాటం, ఎంతో మంది అమరవీరుల త్యాగాలతో తెలంగాణ ఏర్పడితే.. దాన్ని పాకిస్తాన్ విభజనతో పోల్చడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ వాదులు బీజేపీ నేతల తీరుపై మండిపడుతున్నారు.

## 'చిన్నమ్మ' గౌరవం బీజేపీకి కనిపిస్తలేదా?

సుష్మా స్వరాజ్.. బీజేపీ సీనియర్ నాయకురాలు. ఇప్పుడు ఆమె లేరు. కానీ తెలంగాణకు సుష్మ ఇచ్చిన మద్దతుకు గుర్తుగా ఇప్పటికీ ఇక్కడి జనం గుండెల్లో 'చిన్నమ్మ'గా పదిలంగా నిలిచిపోయారు. 2009 నుంచి 2014 వరకు తెలంగాణ కోసం పార్లమెంట్ వేదికగా జరిగిన ప్రతి చర్చలోనూ సుష్మా స్వరాజ్ ప్రతిపక్ష నేత హోదాలో మద్దతుగా స్వరం వినిపించారు. సమైక్యాంధ్ర అంటూ పుట్టుకొచ్చిన కొన్ని శక్తులు తెలంగాణ బిల్లును అడ్డుకోవాలని చూడగా.. ముందుండి తెలంగాణ ఏర్పాటుకు లోక్‌సభ వేదికగా ఆమె సపోర్ట్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సుష్మా స్వరాజ్‌ను 'తెలంగాణ చిన్నమ్మ'గా ఇక్కడి ప్రజలు గౌరవిస్తున్నారు. 2019 ఆగస్టు 6న సుష్మ కన్నుమూసినప్పుడు తెలంగాణలోని ప్రతి ఇల్లు కన్నీళ్లు పెట్టుకుంది. స్వరాష్ట్ర ఏర్పాటుకు 'చిన్నమ్మ' ఇచ్చిన మద్దతును గుర్తుచేసుకుంది. తెలంగాణ ఏర్పాటు విధానాన్ని ఇన్నేండ్లయినా తప్పుపడుతున్న ప్రధాని మోదీ కావొచ్చు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కావొచ్చు, ఎంపీ తేజస్వీ సూర్య లాంటి వాళ్లు కావొచ్చు.. మరి ఆనాడు తెలంగాణ బిల్లుకు మద్దతిచ్చి 'చిన్నమ్మ'గా నిలిచిపోయిన సుష్మా విధానాన్ని తప్పుపడుతున్నట్లేనా? అని తెలంగాణ వాదులు ప్రశ్నిస్తున్నారు. ఇంకా ఎన్నేండ్లు ఇలా తెలంగాణపై విషం కక్కుతారని బీజేపీ నేతలను నిలదీస్తున్నారు.



# ఇరకాటంలో రాష్ట్ర బీజేపీ




బెంగళూరు బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య లోక్‌సభ వేదికగా చేసిన కామెంట్లు తెలంగాణలోని బీజేపీ నేతలను ఆత్మరక్షణలోకి నెట్టాయి. సొంత పార్టీ ఎంపీ చేసిన వ్యాఖ్యలను సమర్థిస్తే ఒక బాధ.. వ్యతిరేకిస్తే మరో బాధ అన్నట్లుగా వారి పరిస్థితి తయారైంది. గతంలో ''తల్లిని చంపి బిడ్డను వేరు చేశారు" అని సాక్షాత్తూ ప్రధాని మోదీ కామెంట్లు చేశారు. ఇప్పుడు "ఇండియా-పాకిస్తాన్ విభజన తరహాలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌గా విభజించారు" అని తేజస్వీ సూర్య వ్యాఖ్యానించారు. ఈ కామెంట్లు యావత్తు తెలంగాణ ప్రజల ఉద్యమాన్ని, త్యాగాన్ని, 60 ఏండ్ల ఆకాంక్షలను అవమానించడమేనని తెలంగాణ వాదులు అంటున్నారు. తేజస్వీ సూర్య ఎక్కడ కూడా తెలంగాణను వ్యతిరేకించలేదని, రాష్ట్ర ఏర్పాటు విధానాన్ని, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన విధానం వల్లే ఎంతో మంది చనిపోవాల్సి వచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు లాంటి వాళ్లు అంటున్నప్పటికీ.. రాష్ట్రం ఏర్పడి 12 ఏండ్లు దాటుతున్నా ఇంకా 'విధానం' అంటూ అమరుల త్యాగాన్ని అవమానిస్తున్నారని తెలంగాణ వాదులు మండిపడుతున్నారు.

## వచ్చే ఎన్నికల్లో పరీక్ష

బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య కామెంట్లు తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆరుగురు ఎంపీలు, ఇద్దరు కేంద్రమంత్రులకు సంకటంగా మారింది. తెలంగాణలో బీజేపీ మీద ప్రజలు వ్యతిరేక భావాన్ని ఏర్పర్చుకునేందుకు ఈ కామెంట్లు దోహదం చేస్తాయన్న వాదన వినిపిస్తున్నది. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయమని, బీసీ వ్యక్తి ముఖ్యమంత్రి అవుతారంటూ ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా ఎంత గంభీరంగా చెప్పినా.. తేజస్వీ సూర్య చేసిన కామెంట్లు ఆ ఆశలను ఆవిరి చేసే పరిస్థితులు తలెత్తాయి. త్వరలో జరగబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీకి నెగెటివ్ ఎఫెక్ట్ కావొచ్చనే అభిప్రాయం ఇప్పటికే తెలంగాణ బీజేపీ నేతల్లో నెలకొన్నది. గత ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీజేపీ ఈసారి మేయర్ స్థానాన్ని దక్కించుకుంటామన్న ధీమాతో ఉన్నది. కానీ తాజాగా తేజస్వీ సూర్య చేసిన కామెంట్లు బీజేపీ నేతలను కలవరపరుస్తున్నాయి.

## పార్టీకి నెగెటివ్..

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సమంజసమేనంటూ బీజేపీ నాలుగు దశాబ్దాల క్రితమే కాకినాడలో జరిగిన పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో తీర్మానం చేసింది. దీన్నే కాకినాడ తీర్మానంగా బీజేపీ గొప్పగా చెప్పకుంటున్నది. 'ఒక ఓటు రెండు రాష్ట్రాలు..' అంటూ పదేపదే ఆ తీర్మానం గురించి గుర్తు చేస్తూ ఉంటుంది. ఇదంతా పార్టీకి సంబంధించిన వ్యవహారం కాగా, ప్రధాని మోదీ పార్లమెంట్ వేదికగా 'తల్లిని చంపి..' అంటూ తెలంగాణ ఏర్పాటు ప్రక్రియలో కాంగ్రెస్‌ను విమర్శించారు. చివరికి అది తెలంగాణ ఏర్పాటు మోదీకి ఇష్టం లేదనే సాధారణ అభిప్రాయంగా జనంలోకి వెళ్లింది. ఇప్పుడు దానికి కొనసాగింపుగా తేజస్వీ సూర్య ఒక అడుగు ముందుకేసి ఇండియా-పాకిస్తాన్ విభజనతో పోల్చడం బీజేపీకి తెలంగాణలో నెగెటివ్‌గా మారింది.